క్లుప్తంగా

స్విమ్స్‌కు రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

తిరుపతి తుడా: స్విమ్స్ శ్రీ బాలాజీ ఆరోగ్య వర ప్రసాదిని పథకానికి ఎన్ఆర్ఐ మురళి, బాలినేని సుచరిత దంపతులు రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఆ దంపతుల కుమారుడు దేవాన్ష్ రెండో పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం స్విమ్స్ డైరెక్టర్ వెంగమ్మకు నగదు అందజేశారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

పాకాల: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు మండలపు విజయ భారతి తెలిపారు. ఇందిరా వైద్య బృందంతో లయన్స్‌క్లబ్ సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్‌కార్డు తీసుకురావాలన్నారు.

ఆలయ నిర్మాణ పనులు వేగవంతం

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ గర్భాలయ పనులను మరింత వేగవంతం చేసి అనుకున్న సమయానికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ఆదేశించారు. ఆయన శుక్రవారం పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మే మొదటి వారం నుంచి తిరుపతి గంగమ్మ జాతర ప్రారంభం అవుతుందన్నారు. అంతకుముందే గర్భాలయ పనులు పూర్తికావాలన్నారు.

రిఫ్రిజిరేటర్ వితరణ



తిరుపతి కల్చరల్: మంగళం తుడా క్వార్టర్స్ వద్ద నున్న రాస్ ఓల్డేజ్ హోమ్‌కు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు శుక్రవారం రూ.48 వేల రిఫ్రిజిరేటర్‌ను వితరణ చేశారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్స్ స్వాతి, మొగిలీశ్వర్ మాట్లాడుతూ మహిళా సాధికారతే లక్ష్యంగా యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులు, మహిళలకు సహాయ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ప్రస్తుతం డివిజనల్ జనరల్ మేనేజర్ రామప్రసాద్ ఆదేశాల మేరకు ఓల్డేజ్ హోమ్‌లోని వృద్ధుల సౌకర్యార్థం రిఫ్రిజిరేటర్‌ను అందజేస్తున్నట్లు తెలిపారు.

దుప్పట్లు, బియ్యం పంపిణీ

రామచంద్రాపురం: మండలంలోని సీరామాపురం పంచాయతీ కరుణ కాలనీలో పేదలకు శుక్రవారం సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ నిరంజన్‌బాబు దుప్పట్లు, బియ్యం పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కాలనీ పరిసరాల్లో నీటి ట్యాంకులను ఏర్పాటు చేశారు. మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శరవణ కుమార్ పాల్గొన్నారు.

తిరుచ్చిపై సిరుల తల్లి విహారం

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం తిరుచ్చిపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. శ్రీకృష్ణ ముఖమండపంలో స్వామి, అమ్మవార్లకు కల్యాణం చేశారు. సాయంత్రం ఊంజల్ సేవను కనుల పండువగా చేపట్టారు. తదుపరి అమ్మవారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

విద్యుత్సవ్-2కే23 ప్రారంభం

తిరుపతి ఎడ్యుకేషన్: శ్రీపద్మావతి మహిళా వర్సిటీలోని ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో విద్యుత్సవ్-2కే23 పేరుతో ఏర్పాటుచేసిన రెండు రోజుల జాతీయ స్థాయి సాంకేతిక పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. దేశంలోని పలు ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ ఎ.లక్ష్మీదేవి, మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ పి.మల్లికార్జున, వీసీ.వీరారెడ్డి, కో–ఆర్డినేటర్ డి.నర్మిత, కన్వీనర్ ఎం.పల్లవి, కోకన్వీనర్ కె.షాలిని, స్టూడెంట్ కన్వీనర్ బి.ప్రీతి, కో–కన్వీనర్ ఎస్.సుష్మ పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

తిరుపతి కల్చరల్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని హలీమ్ నేషన్ సౌజన్యంతో శుక్రవారం రాత్రి ఎస్‌టీవీ నగర్‌లోని మక్కా మసీద్‌లో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే. బాబు మాట్లాడుతూ ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు ఉండి రంజాన్‌ను జరుపుకుంటారని తెలిపారు. ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన హలీమ్ నేషన్ ప్రతినిధులను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చంద్రగిరి: కల్‌రోడ్డుపల్లి సమీపంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందాడు. పాకాల మండలం దేశిరెడ్డిపల్లికి చెందిన రాంబాబు(46) బైక్‌లో నడింపల్లికి బయల్దేరాడు. కల్‌రోడ్డుపల్లి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. కింద పడిన రాంబాబు తలపై నుంచి వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

సీఎం జగన్ పేదల పక్షపాతి

- పేదల సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన
- రూ.31.58 కోట్ల ఆసరా చెక్కు పంపిణీ
- తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి



తిరుమలలో చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భూమన



తిరుపతిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



సమావేశానికి హాజరైన మహిళలు

తిరుపతి తుడా: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షపాతి అని, వారి సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు జరుగుతున్న మంచిని చంద్రబాబునాయుడు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. అందుకే ప్రజల పట్ల కక్ష, ద్వేషాన్ని పెంచుకున్నారని, సీఎంను సైకో అంటూ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని చెప్పారు. చంద్రబాబుకు ముఖ్యమంత్రిగా ప్రజలు 14 ఏళ్ల అవకాశం ఇస్తే కులాల కుంపటిని రగిలించారని, పేదలను అణిచివేసి కార్పొరేట్‌కు కొమ్ముకాశారని తెలిపారు. జీవితమంతా కుట్రలు, కుతంత్రాలతో నీచ రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. అధికారం కోసం ఎంతటి నీచానికైనా దిగజారే వ్యక్తి చంద్రబాబుని ఆరోపించారు. ప్రజలు తనకు ఇచ్చిన అవకాశంతో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళల్ని మహారాణులుగా చేస్తున్నారని పేర్కొన్నారు. చట్టసభల్లో, ఇతర రాజకీయ పదవుల్లో బీసీలకు అత్యధిక సీట్లు కేటాయించిన ఘనత సీఎంకు దక్కుతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ ఆసరా అమలు చేస్తున్నారని తెలిపారు. మూడో విడతలో 7,98,395 సంఘాల్లోని 78,94,169 మందికి రూ.6,419.89 కోట్లు జమ చేశారని చెప్పారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న జగన్ మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. పొరబాటున చంద్రబాబును నమ్మి మరొక సారి అధికారమిస్తే ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలను ఆపేసి కక్ష సాధింపు చర్యలకు దిగుతారని హెచ్చరించారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి మాట్లాడుతూ తిరుపతి నగరంలో వైఎస్సార్ ఆసరా కింద మూడో విడతలో రూ.31.58 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, కార్పొరేటర్లు శేఖర్ రెడ్డి, బసవ గీత, పొన్నాల చంద్ర, సి.కె. రేవతి, శ్రావణి, తిరుత్తణి శైలజ, నరేంద్రనాథ్, నారాయణ, ఆదం రాధాకృష్ణారెడ్డి, కుడితి సుబ్రమణ్యం, మెప్మా కృష్ణవేణి, నాయకులు మునిరామిరెడ్డి, నైనార్ మధుబాల, వెంకటేష్ రాయల్, నాగిరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో..

తిరుమల బాలాజీ నగర్‌లో శుక్రవారం వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి స్థానిక మహిళలతో ముచ్చటించారు. మంచి చేస్తున్న జగనన్నకు అండగా నిలవాలని కోరారు.

కార్పొరేట్‌ను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలు



విద్యార్థులతో చెంగళ్ రెడ్డి, ఉపాధ్యాయులు

ఎర్రావారిపాళెం (చంద్రగిరి): సీఎం జగనన్న ప్రభుత్వంలో నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌ను తలదన్నేలా అభివృద్ధి చెందాయని ఎర్రావారిపాళెం జెడ్పీటీసీ కరుణాకర్ రెడ్డి తెలిపారు. మండలంలోని యలమంద జెడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం పూర్వ విద్యార్థి చెంగళ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ కరుణాకరరెడ్డి, సీఐ తులసీరాం పాల్గొని మాట్లాడుతూ ఇష్టంగా చదివినప్పుడే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చన్నారు. పూర్వ విద్యార్థి చెంగళ్ రెడ్డి మాట్లాడుతూ 2013 నుంచి ఇప్పటి వరకు యలమంద జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రతి ఏటా ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది నుంచి పంచాయతీ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులందరికీ పుస్తకాలు అందజేస్తామన్నారు. త్వరలో జరగబోయే 10వ తరగతి పరీక్షల్లో టాప్–5లో నిలిచే వారికి ఇంటర్మీడియట్ ఫీజు కింద ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున చెల్లిస్తానని ప్రకటించారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల సామగ్రి పంపిణీ చేశారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. సర్పంచ్ నాగరాణి, ఎంపీటీసీ పరంధామయ్య, హెచ్ఎం చంద్రానాయక్, నాయకులు శంభుశంకర్ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మారుతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేరట్ లేన్ జ్యువెలరీ ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూమన

తిరుపతి తుడా: టాటా గ్రూప్‌నకు చెందిన తనిష్క్ వారి నేతృత్వంలో తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులో ఏర్పాటుచేసిన కేరట్ లేన్ బంగారు, వజ్రాల షోరూంను శుక్రవారం ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ప్రారంభించారు. ఈ షోరూం దేశంలోనే 212వదని, ఇక్కడ అన్ని రకాల ఆభరణాలు ఉంటాయని మేనేజర్ దీపక్ రెడ్డి తెలిపారు. స్థానిక కార్పొరేటర్ శాలిని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా అక్కినపల్లి



అక్కినపల్లి లక్ష్మయ్యను సత్కరిస్తున్న బీసీ నేతలు

తిరుపతి కల్చరల్: బీసీ సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా అక్కినపల్లి లక్ష్మయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రకాశం రోడ్డులోని బీసీ సంఘర్షణ సమితి కార్యాలయంలో శుక్రవారం 21 బీసీ కుల సంఘాల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా బుసగాని లక్ష్మయ్య, అధ్యక్షుడిగా అక్కినపల్లి లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శిగా సాకం ప్రభాకర్, కోఆర్డినేటర్‌గా అశోక్ సామ్రాట్ యాదవ్, కోశాధికారిగా గుండ్లూరు వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా బీవీ.కేశవులు, వాసుయాదవ్, సుబ్రమణ్యం యాదవ్, గుణశేఖర్, బొమ్మగుంట దాము, రమణ, మునిరాజ, మునిరామిరెడ్డి, మధుసూదన్, రామయ్య ఆచారి, కేవీ.రమణ తదితరులను ఎన్నుకున్నారు. బీసీ జాతీయ నేత ఆల్‌మెన్‌రాజు, అధికార భాషా ప్రతినిధి మస్తానమ్మ, సీకే రేవతి, మునిరామిరెడ్డి, జగన్నాథం, వినుకొండ సుబ్రమణ్యం, సాకం నాగరాజు, ఏకాంబరం పాల్గొన్నారు.

నేటి నుంచి ఏపీపీఎస్సీ పరీక్షలు

తిరుపతి అర్బన్: ఏపీపీఎస్సీ ఉద్యోగ పరీక్షలు శనివారం నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు డీఆర్వో శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మూడు రోజుల పాటు రెండు షెషన్స్‌లో పరీక్షలుంటాయన్నారు. సమీక్షలో ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారులు గిరిజారాణి, యశోద, లైజన్ అధికారులు, ఏపీఎస్ ఆర్టీసీ అధికారి సత్యనారాయణ, వైద్య ఆరోగశాఖ నుంచి డాక్టర్ హర్షవర్ధన్, స్పెషల్ బ్రాంచ్ చంద్ర, గణపతి, రవీంద్ర, సెక్షన్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, డీటీ చెంచయ్య హాజరయ్యారు.

జూనియర్ సివిల్ జడ్జిలకు శిక్షణ

తిరుపతి లీగల్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కొత్తగా నియమితులైన జూనియర్ సివిల్ జడ్జిలకు ఈ నెల 10 నుంచి మే 20వ తేదీ వరకు గుంటూరు జిల్లా మంగళగిరిలోని రాష్ట్ర జ్యుడిషియల్ అకాడమీలో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు రాష్ట్ర హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. శిక్షణకు వెళ్లే వారిలో మదనపల్లి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఐ.ప్రవీణ్‌కుమార్, పీలేరు అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.గాయత్రి, నగరి జూనియర్ సివిల్ జడ్జి ఎస్.విష్ణువర్మ, చిత్తూరు ప్రత్యేక మొబైల్ కోర్టు జడ్జి జె.కీర్తన, చిత్తూరు నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి షేక్ బాబాజాన్, శ్రీకాళహస్తి అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.కృష్ణప్రియ, తంబళ్లపల్లి జూనియర్ సివిల్ జడ్జి ఎ.ఉమ్మర్‌ఫరూక్ ఉన్నారు. వారి స్థానాల్లో ఆయా కోర్టులకు ఇన్‌చార్జి న్యాయమూర్తులను హైకోర్టు నియమించింది.

నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న పోకల అశోక్‌కుమార్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సతీమణి స్వర్ణలత



శ్రీసీతారాముల కల్యాణం చేస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం సీతారాముల కల్యాణం నేత్రపర్వంగా సాగింది. సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి కల్యాణ వేదికపై కొలువుతీర్చి సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం సీతారాముల వారి ఉత్సవర్లను ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. సీతారాముల కల్యాణాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం ముత్యాల తలంబ్రాల ఊరేగింపును వేడుకగా చేపట్టారు. టీటీడీ అధికారులు పరిపాలన భవనం నుంచి ఏనుగు అంబారిలపై ముత్యాల తలంబ్రాలను ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు. టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సతీమణి స్వర్ణలత, ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న పాల్గొన్నారు.

రేపు గ్రూప్-2 సిలబస్‌పై ఉచిత అవగాహన సదస్సు

తిరుపతి ఎడ్యుకేషన్: గ్రూప్–2 నూతన సిలబస్‌తో పాటు సచివాలయ ఉద్యోగాలపై ఆదివారం ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు తిరుపతి ప్రకాశం రోడ్డు టీటీడీ కాంప్లెక్స్‌లోని శ్రీవిద్య ఐఏఎస్ అకాడమీ కోఆర్డినేటర్ ఎం.గుణవతి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణతోపాటు మెటీరియల్ అందజేస్తామని వెల్లడించారు. వివరాలకు 7013119918లో సంప్రదించాలని కోరారు.

లావణ్యకుమారికి జాతీయ స్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న పి.లావణ్యకుమారి

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాల, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగాధిపతి పి.లావణ్యకుమారికి రామకృష్ణ పరమహంస రీసెర్చ్ గ్రాంట్ అగ్రికల్చరల్ జాతీయ స్థాయి అవార్డు అందజేసింది. వ్యవసాయ విభాగంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ బేస్డ్ పెస్ట్ మోడలింగ్ ఇన్ రైస్ క్రాప్ అనే పరిశోధనకు ఆమె ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఇటీవల న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

నిధులు మంజూరు చేయండి



కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ సెక్రటరీతో చర్చిస్తున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం: గ్రామీణ హస్తకళల కేంద్రం (క్రాఫ్ట్ విలేజ్‌కి) నిధులను మంజూరు చేయాలని తిరుపతి ఎంపీ గురుమూర్తి కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ సెక్రటరీ రచనషాని కోరారు. ఆయన శుక్రవారం ఢిల్లీలోని ఆమెకు వినతి పత్రం అందజేశారు. శ్రీకాళహస్తికి దగ్గర్లో ఉన్న ఈ క్రాఫ్ట్ విలేజ్ పరిధిలో ఐదు వేల మంది కళాకారులు కలంకారీ ద్వారా ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఆమె స్పందిస్తూ క్రాఫ్ట్ విలేజ్‌ని త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా వెంకటకుమార్



జి.వెంకటకుమార్, గోపిచంద్, ఎం.మురళి

తిరుపతి లీగల్: తిరుపతి న్యాయవాదుల సంఘం నూతన అధ్యక్షుడిగా జి.వెంకటకుమార్ గెలుపొందారు. తిరుపతి కోర్టు ఆవరణలో శుక్రవారం ఎన్నికలు జరిగాయి. అధ్యక్ష పదవికి నలుగురు పోటీపడ్డారు. ఉపాధ్యక్షుడిగా టి.గోపిచంద్, ప్రధాన కార్యదర్శిగా ఎం.మురళి, జాయింట్ సెక్రటరీగా గాలి మధుసూదన్‌రావు, మహిళా రెప్రజెంటేటివ్‌గా కె.మల్లీశ్వరి గెలుపొందారు. వారికి ఎన్నికల అధికారి గొట్టి గజేంద్ర శుక్రవారం రాత్రి డిక్లరేషన్ పత్రాలు అందజేశారు.

ఘనంగా వార్షికోత్సవం

పాకాల: మండలంలోని పదిపుట్లబైలు ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం వార్షికోత్సవంతో పాటు సరస్వతీ పూజను ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ బుజ్జమ్మ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అక్కచెల్లెమ్మలకు రూ.10.45 కోట్ల లబ్ధి



చిన్నగొట్టిగల్లు: వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

- వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ
- ఎంపీపీ మోహిత్‌రెడ్డిని ఆశీర్వదించాలని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అభ్యర్థన



సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళా ప్రజా ప్రతినిధులు

పాకాల: ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ ఆసరాను క్రమం తప్పకుండా అందజేస్తున్నారని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం పాకాల మండలంలోని 1151 డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.10.45 కోట్ల వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా చంద్రగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. అనంతరం మహిళా ప్రజా ప్రతినిధులతో కలిసి సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.

మోహిత్‌రెడ్డిని ఆశీర్వదించండి..

తన తనయుడు, తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆదరించాలని చెవిరెడ్డి కోరారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చిందని తెలిపారు. ఇలాంటి ప్రభుత్వం ఉంటేనే ప్రజలు సంతోషంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, నంగాబాబురెడ్డి, నంగా నరేష్‌రెడ్డి, సర్పంచులు సుబ్రమణ్యం, కస్తూరి, కళావతి, వసంత, సునిత, ఎంపీటీసీలు కస్తూరి, రమేష్, నాయకులు మునీర్, కపిలేశ్వర్‌రెడ్డి, గుండ్లూరి సురేష్, ఖాజామాస్తాన్, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఎంపీడీఓ రమేష్‌బాబు, ఏపీఎం కోమలాదేవి పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లులో..

భాకరాపేట: రాష్ట్రంలోని మహిళలను మహారాణులను చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. చిన్నగొట్టిగల్లులో శుక్రవారం 633 గ్రూపుల్లోని మహిళలకు రూ.5.54 కోట్ల వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ చిన్నగొట్టిగల్లు మండలానికి చెందిన డ్వాక్రా సంఘాల మహిళలకు మూడు విడతల్లో రూ.16.64 కోట్లను అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో చిన్నగొట్టిగల్లు ఎంపీపీ బాలం.యుగంధర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, జెడ్పీటీసీ స్వరూప, ఎంపీడీవో దేవేంద్రబాబు, తహసీల్దార్ హనుమాన్‌నాయక్, ఏపీఎం కుమార్ పాల్గొన్నారు.

పరామర్శ

అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నగొట్టిగల్లు మండలానికి చెందిన ముస్లిం మత పెద్ద సికిందర్ బాషాను ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పరామర్శించారు.

సీఎం జగన్‌కు దళిత క్రైస్తవులు అండగా నిలవాలి



మాట్లాడుతున్న ఎలమంచిలి ప్రవీణ్

తిరుపతి కల్చరల్: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి రుణం తీర్చుకోవాలని ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ పిలుపునిచ్చారు. ఆయన విశాఖలోని ఒక ప్రైవేటు హోటల్లో మీడియాతో మాట్లాడారు. దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలని గత ప్రభుత్వాలకు అనేకసార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమస్య పరిష్కారానికి తీసుకున్న నిర్ణయం అభినందనీయమని కొనియాడారు.

ది ఎక్మో మీట్ విజయవంతం

తిరుపతి తుడా: స్విమ్స్ పద్మావతి ఆడిటోరియంలో శుక్రవారం స్విమ్స్, పద్మావతి చిన్నపిల్లల కార్డియాక్ కేర్ సెంటర్ సంయుక్తంగా నిర్వహించిన ది ఎక్మో మీట్ –2023 విజయవంతమైంది. స్విమ్స్ డైరెక్టర్ బి.వెంగమ్మ, చిన్నపిల్లల కార్డియాక్ కేర్ సెంటర్ డైరెక్టర్ శ్రీనాథరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. స్విమ్స్ డైరెక్టర్ వెంగమ్మ మాట్లాడుతూ ఎక్మోను గుండె, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడే వారికి చికిత్స అందించేందుకు ఉపయోగిస్తారన్నారు. పద్మావతి చిన్నపిల్లల గుండె చికిత్సాలయం డైరెక్టర్ శ్రీనాథరెడ్డి మాట్లాడుతూ గుండె చికిత్సల ఆస్పత్రిలో 15 నెలల్లో 11 వందలకు పైగా గుండె శస్త్ర చికిత్సలు, ఇద్దరికి గుండె మార్పిడి చికిత్సను చేపట్టినట్టు వివరించారు.

అక్రమ నిర్మాణాలు తొలగింపు



నిర్మాణాలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

తిరుపతి మంగళం: మంగళం సమీపంలోని కోళ్లఫారాలు వద్ద ప్రభుత్వ స్థలంలో నిర్మించిన నిర్మాణాలను రెవెన్యూ అధికారులు శుక్రవారం తొలగించారు. చెన్నాయగుంట లెక్క దాఖలా సర్వేనెంబర్ 195లోని ప్రభుత్వ స్థలంలో గురువారం రెండు రేకుల షెడ్లు నిర్మించారు. స్థానికులు ఫిర్యాదు చేయడంతో అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ ఆదేశాల మేరకు ఆర్ఐ జానీబాషా, వీఆర్వోలు భూపతి, సుమన్ పర్యవేక్షణలో తిరుమలనగర్ పంచాయతీ సిబ్బంది ఇళ్లను తొలగించారు. తమ వద్ద 18 ఏళ్ల క్రితం రెవెన్యూ అధికారులు ఇచ్చిన పట్టాలు ఉన్నాయని ఇళ్ల నిర్మాణదారులు తెలిపారు. వాటిని తీసుకుని అర్బన్ తహసీల్దార్‌ని కలవాలని ఆర్ఐ జానీబాషా తెలిపారు. అప్పటి వరకు ఎవ్వరూ నిర్మాణం చేపట్టరాదని హెచ్చరించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

తిరుపతి రూరల్: సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సంజయ్‌గాంధీకాలనీ, మారుతినగర్, లీలామహల్ జంక్షన్, చింతలచేను, టీపీ ఏరియా, ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్, పీకే లేఅవుట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ వాసుదేవరెడ్డి తెలిపారు. సహకరించాలని కోరారు.

36 మందికి జరిమానా

తిరుపతి లీగల్: తిరుమలలో మద్యం తాగి వాహనాలు నడపడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం వంటి నేరాలకు పాల్పడిన 36 మందికి రూ.14,400 జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు శుక్రవారం తిరుమల క్యాంప్ కోర్టులో తీర్పు చెప్పారు. నిందితులను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు.

సమాజ శ్రేయస్సుకు కృషి చేయండి



గ్రాడ్యుయేషన్ డేను ప్రారంభిస్తున్న అతిథులు

తిరుపతి తుడా: వైద్యులుగా చరిత్ర గుర్తు పెట్టుకునేలా సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ పిలుపునిచ్చారు. ఎస్వీ మెడికల్ కళాశాలలో శుక్రవారం ఎంబీబీఎస్ 2017 సంవత్సరపు వైద్య విద్యార్థులకు 58వ గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. 225 మంది పట్టాలు అందుకున్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వైద్యరంగంలో పరిశోధనలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన వైద్య విద్యార్థులకు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్వీ మెడికల్ కళాశాల పూర్వపు ప్రిన్సిపాళ్లు రామసుబ్బారెడ్డి, హరినాథ్, బలరామరాజు, వాసుదేవ రెడ్డి, ప్రముఖ వైద్యులు మదన్ మోహన్ రెడ్డి, సునంద కుమార్ రెడ్డి, రుయా, ప్రసూతి ఆస్పత్రుల సూపరింటెండెంట్లు నాగమునీంద్రుడు, పార్థసారథిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాకి మాధవరావు జీవితం ఐఏఎస్‌లకు ఆదర్శం

- ప్రకాష్ అంబేడ్కర్
- సంకెళ్లను తెంచుకుంటూ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రకాష్ అంబేడ్కర్

తిరుపతి ఎడ్యుకేషన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ చీఫ్ సెక్రటరీ కాకి మాధవరావు జీవితం ఐఏఎస్‌లకు ఆదర్శమని బీఆర్ అంబేడ్కర్ మనవడు ప్రకాష్ అంబేడ్కర్ తెలిపారు. సంకెళ్లను తెంచుకుంటూ.. (దళిత చీఫ్ సెక్రటరీ ఆత్మకథ) పేరుతో కాకి మాధవరావు రాసిన పుస్తకాన్ని తిరుపతి ఎస్వీయూలోని శ్రీనివాస ఆడిటోరియంలో శుక్రవారం ఆవిష్కరించారు. ప్రకాష్ అంబేడ్కర్ మాట్లాడుతూ కాకి మాధవరావు కాకి మాధవరావు వంటి వ్యక్తుల జీవిత విశేషాలను పాఠ్యాంశాలుగా చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని సామాజిక ఆచరణకు పూనుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్వీయూ వీసీ కె.రాజారెడ్డి, మాజీ ఐఆర్ఎస్ అధికారి శివభాగ్యరావు మాట్లాడుతూ కాకి మాధవరావు జీవితంలోని ఎత్తుపల్లాలపై అధ్యయనం చేయాలని, తద్వారా ఉన్నత స్థాయిలో రాణించేందుకు అవసరమైన స్ఫూర్తిని పొందవచ్చని సూచించారు. ఏపీ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ సునీత, ఏపీ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కే.ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.